సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం ׀ 2 ׀ డిసెంబర్ ׀ 2023



ఇద్దరికి తీవ్ర గాయాలు

చింతపల్లి మండలంలో శుక్రవారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. 8లో



డ్రోన్ పనితీరుపై అవగాహన

రంపచోడవరం మండలంలోని కొండపల్లి, శరభవరం గ్రామాల్లో రైతులకు డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పించారు. 8లో

మారేడుమిల్లి సీఐగా రుద్రరాజు



మారేడుమిల్లి సీఐగా రుద్రరాజు భీమరాజు బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఏలూరు రేంజ్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. 8లో

న్యూస్‌రీల్

పింఛన్ సొమ్ముతో టోకూరు కార్యదర్శి పరారీ

పోలీసులకు ఎంపీడీవో ఫిర్యాదు

అనంతగిరి: మండలంలోని టోకూరు పంచాయతీ కార్యదర్శి నక్కా రవికుమార్ లబ్ధిదారులకు అందజేయాల్సిన పింఛను సొమ్ముతో పరారయ్యారు. టోకూరు పంచాయతీ పరిధిలో పింఛన్‌దారులకు ఇవ్వాల్సిన రూ. 7,01,750 సొమ్మును గురువారం కాశీపట్నం ఎస్‌బీఐ బ్రాంచిలో ఆయన విత్‌డ్రా చేశారు. అయితే ఒకటో తేదీ సాయంత్రం అవుతున్నా పింఛను సొమ్ము అందకపోవడంతో పింఛనుదారులు ఆందోళన చెందారు. కార్యదర్శికి టోకూరు వెల్ఫేర్ అసిస్టెంట్ త్రినాథ్ పలుమార్లు ఫోన్ చేయగా, స్విచ్ ఆఫ్ రావడంతో ఎంపీడీవోకు సమాచారం అందించారు. దీంతో టోకూరు పంచాయతీ కార్యదర్శిపై శుక్రవారం ఎంపీడీవో శ్రీహర్షిత్, వెల్ఫేర్ అసిస్టెంట్ త్రినాథ్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చింతూరులోనే పరీక్ష కేంద్రం

ఐటీడీఏ పీవో కావూరి చైతన్య

చింతూరు: ఉచిత సివిల్స్, గ్రూప్–1,2 కోచింగ్‌లో భాగంగా రెండోదశ పరీక్షకు చింతూరులోనే పరీక్షాకేంద్రం ఏర్పాటు చేసినట్లు చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాంత విద్యార్థులు రంపచోడవరం కాకుండా చింతూరులోనే పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు. వారి అభ్యర్థన మేరకు ఈనెల 3న చింతూరు గురుకుల పాఠశాలలో రెండోదశ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. దీనిపై సంబంధిత అభ్యర్థులకు సమాచారం పంపిస్తున్నట్టు పీవో తెలిపారు.

9న అరకులో జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జడ్జి శివకిరణ్

అరకులోయ టౌన్: స్థానిక కోర్టు ఆవరణలో ఈనెల 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని జడ్జి శివకిరణ్ తెలిపారు. అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి, ఎస్‌ఐలతో పాటు న్యాయవాదులతో శుక్రవారం కోర్టు ఆవరణలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ కేసులు పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. ఇందుకు సమష్టి కృషి అవసరమన్నారు. ఎస్‌ఐలు రాము, సంతోష్, సంతోష్‌కుమార్, న్యాయవాదులు మురళీమోహన్, రత్నంరాజు, ప్రభాకర్, రాంబాబు, సింహాచలం, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ గంజాయి జోలికి వస్తే పీడీ యాక్ట్

పాడేరు సీఐ సుధాకర్ హెచ్చరిక



బెయిల్‌పై ఉన్న నిందితులకు కౌన్సెలింగ్ చేస్తున్న పాడేరు సీఐ సుధాకర్

సాక్షి,పాడేరు: గంజాయి సాగు, అక్రమ రవాణాలో పట్టుబడి జైలు నుంచి బెయిల్‌పై వచ్చిన నిందితులు మళ్లీ గంజాయి జోలికి వెళితే పీడీ యాక్ట్ అమలుచేస్తామని పాడేరు సీఐ సుధాకర్ హెచ్చరించారు. శుక్రవారం వారందరికి ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. గంజాయి సాగు, రవాణా వంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండి ప్రశాంత జీవనం సాగించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ లక్ష్మణరావు పాల్గొన్నారు.

67 మందికి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు



శస్త్ర చికిత్స చేస్తున్న వైద్యులు

చింతపల్లి రూరల్: మండలంలో శుక్రవారం లోతుగెడ్డ పీహెచ్‌సీలో 67 మందికి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు విజయవంతంగా చేశామని రాష్ట్ర కుటుంబ నియంత్రణ విభాగం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జనార్దన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ఇటువంటి శస్త్ర చికిత్సలు చేయడం ఆనందంగా ఉందన్నారు. మాతాశిశు మరణాలను నియంత్రించేందుకు కుట్టు,కోత లేని కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు కోసం మగవారికి అవగాహన కల్పించామన్నారు. అనంతరం చికిత్సలు చేయించుకున్న వారికి జాగ్రత్తలు వివరించి మందులు పంపిణీ చేశారు.

ఇంటివద్దనే ఉపాధి



పాడేరు మండలంలోని కోట్ల గరువు గ్రామానికి చెందిన ఈమె పేరు తోట శాంతి కుమారి. రెండేళ్ల క్రితం కుట్టు శిక్షణ పొందింది. మిషన్ కొనుక్కొనే స్థోమత లేక గతేడాది పాడేరు ఐటీడీఏ స్పందనలో స్వయం ఉపాధి కల్పించాలని దరఖాస్తు చేసుకుంది.కలెక్టర్ సుమిత్‌కుమార్ పరిశ్రమలశాఖ అధికారులతో మాట్లాడారు. పీఎంఈజీపీలో రూ.30 వేల రుణం పాడేరు యూనియన్ బ్యాంకు ద్వారా మంజూరు చేశారు. ఈ మొత్తంతో కుట్టుమిషన్ (మోటార్), టైలరింగ్ మెటీరియల్ కొనుగోలు చేసింది. 11 నెలలుగా ఇంటివద్దనే ఉంటూ కుట్టు పనిచేసుకుంటోంది. వారానికి రెండు వేల వరకు ఆదాయం వస్తోందని ఆమె తెలిపింది. ఇప్పటికి రుణ మొత్తంలో రూ.10 వేలు చెల్లించినట్టు తెలిపింది. ఇలా ఎంతో మంది ప్రభుత్వం అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు.

స్వయం ఉపాధి వైపు యువత చూపు

- వరంలా పీఎంఈజీపీ
- రూ.10 వేల నుంచి రూ.10 లక్షల వరకు రుణాలు
- గతేడాది 98 మందికి లబ్ధి
- ఈ ఏడాది 419 మంది దరఖాస్తు
- యూనిట్ విలువలో 35శాతం రాయితీ
- ప్రభుత్వ సహకారంతో సత్ఫలితాలు

సాక్షి,పాడేరు: జిల్లాలోని అన్ని వర్గాల నిరుద్యోగ యువతకు ప్రధానమంత్రి ఉపాధి పథకం(పీఎంఈజీపీ) వరంలా మారింది. పాడేరు కేంద్రంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఏర్పడిన నాటి నుంచి కలెక్టర్ సుమిత్‌కుమార్, జిల్లా పరిశ్రమలశాఖ అధికారులు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా కృషి చేస్తున్నారు.

కలెక్టర్ చొరవతో..

పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల్లో నిర్వహించే స్పందన కార్యక్రమాలకు కూడా నిరుద్యోగ యువతీయువకుల నుంచి స్వయం ఉపాధి కోరుతూ దరఖాస్తులు వచ్చేవి.సూక్ష్మ పరిశ్రమలు, స్వయం ఉపాధి యూనిట్లపై దృష్టిసారించిన కలెక్టర్, ఇతర అధికారులు పీఎంఈజీపీ పథకంపై దృష్టి సారించారు. ఈ పథకంలో ఒకొక్క యూనిట్ ఏర్పాటుకు రూ.10 వేల నుంచి రూ.10 లక్షల వరకు రుణం పొదారు.

35 శాతం రాయితీ..

పీఎంఈజీపీ రుణ మొత్తంలో 35 శాతం రాయితీ పొందవచ్చు. రుణాల గ్రౌండింగ్‌కు సంబంధించి కలెక్టర్ సుమిత్‌కుమార్ బ్యాంక్ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశాలు సత్ఫలితాలిచ్చాయి. లీడ్ బ్యాంక్ మేనేజర్ తేజ కూడా స్వయం ఉపాధి కల్పన రుణాలకు మంజూరుకు కృషి చేశారు.

ఉపాధి కల్పించే స్థాయికి..

గతేడాది 94 మంది నిరుద్యోగులు పీఎంఈజీపీ పథకంలో రూ.323లక్షల 74వేల మేర రుణాలు పొందారు. కుట్టు మెషీన్లు, ఫ్యాషన్ టెక్నాలజీ, హోటళ్లు, ఇంటర్నెట్, డీటీపీ, ఫొటో స్టూడియో, కార్లు, మినీ వ్యాన్‌లు పొందారు. వీటితో స్వయం ఉపాధి సాధించి మరికొంతమందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగారు.మాజీ మావోయిస్టు జలంధర్‌రెడ్డి కూడా ఇదే పథకంలో లబ్ధి పొందారు. రూ.10 లక్షల రుణంతో ట్యాక్సీ ఏర్పాటు చేశారు.



మాజీ మావోయిస్టు జలంధర్‌రెడ్డికి పీఎంఈజీపీలో రుణం చెక్కును అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఇతర అధికారులు (ఫైల్)

వచ్చే జనవరి నెలాఖరులోగా..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పీఎంఈజీపీ రుణాలు పొందేందుకు 419 దరఖాస్తులను నిరుద్యోగులు జిల్లా పరిశ్రమల శాఖకు దరఖాస్తు చేశారు. వీరిలో 41మందికి రూ.60 లక్షల రుణాలను పంపిణీ చేశారు.మిగిలిన అభ్యర్థుల రుణాల పంపిణీ వివిధ స్థాయిలో ఉన్నాయి. వచ్చే జనవరి నెలాఖరు నాటికి రుణాల పంపిణీ లక్ష్యం పూర్తిచేసే పనిలో అధికార వర్గాలు ఉన్నాయి.

బ్యాంకుల సహకారంతో రుణాలు



నిరుద్యోగ యువత పీఎంఈజీపీలో రుణాలకు దరఖాస్తు చేసుకుంటే బ్యాంకుల సహకారంతో రుణాలు మంజూరు చేస్తున్నాం.స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కలెక్టర్ సుమిత్‌కుమార్ సహకారంతో పరిశ్రమలశాఖ పనిచేస్తుంది. అనేక రుణాల యూనిట్ల ద్వారా నిరుద్యోగులు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు నిరుద్యోగులు ముందుకు రావాలి. పీఎంఈజీపీలో రుణాల పంపిణీ నిరంతర ప్రక్రియ.

– వణీధర్‌రామన్, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి, పాడేరు

రైతులు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: రానున్న రెండు మూడు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పంటకోతలు పూర్తయిన పొలాల్లోని వరి పనలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాచి కుప్పలు వేసుకుని టార్పాలిన్లు కప్పాలని సూచించారు. జిల్లాలోని పలు రిజర్వాయర్ల ప్రాంతాల్లో మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. గిరిజనులు ప్రమాదకర గెడ్డలు, వాగులు దాటి ప్రయాణాలు చేయవద్దన్నారు. జిల్లా, మండలస్థాయి అధికార యంత్రాంగమంతా స్థానికంగానే అందుబాటులో ఉండి, ప్రజలను అప్రమత్తం ఆయన ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షాలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడినా సంబంధిత సమాచారం తెలిసిన వెంటనే మండల, జిల్లా స్థాయి అధికారులు సకాలంలో స్పందించి సత్వర సాయం అందించాలన్నారు. వాయుగుండం సోమవారం సాయంత్రానికి చెన్నై–మచిలీపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉందన్నారు. దీని ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు, కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలుపడే అవకాశం ఉందన్నారు. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగాన్ని ముందస్తుగానే అప్రమత్తం చేస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

అనంతగిరి: మండలంలోని టోకూరు పంచాయతీ సాధారణ నిధులు దుర్వినియోగానికి పాల్పడిన కార్యదర్శి నక్కా రవికుమార్ చర్యలు తీసుకోవాలని సర్పంచ్ మోస్య ఉన్నతాధికారులను కోరారు శుక్రవారం పాడేరులోని కలెక్టర్ సుమిత్‌కుమార్, డీఎల్పీవో, ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసినట్టు సర్పంచ్ తెలిపారు. తమ పంచాయతీలో సాధారణ నిధులు రూ.2,42,553 నిధులను కార్యదర్శి దుర్వినియోగం చేశారని సర్పంచ్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

క్రీడా ప్రతిభను వెలికితీయడమే లక్ష్యం



క్రీడా కిట్లను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు తదితరులు



వాలీబాల్ సర్వీసు చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి తదితరులు

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి
- ఆడుదాం ఆంధ్రా క్రీడా కిట్ల పంపిణీ

సాక్షి,పాడేరు: గ్రామీణ యువతలో క్రీడా ప్రతిభను వెలికితీయడమే ఆడుదాం ఆంధ్రా లక్ష్యమని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఆడుదాం ఆంధ్రాకు సంబంధించి ప్రచార పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. అనంతరం క్రీడా కిట్లను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఏపీ ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు,ఎంపీపీ ఎస్.రత్నకుమారి, వైస్ ఎంపీపీ కె.కనకాలమ్మ,పాడేరు మార్కెట్ చైర్మన్ కూతంగి సూరిబాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రాను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 51రోజుల పాటు నిర్వహిస్తుందన్నారు. గిరిజన ప్రాంతాల్లో అనేక రకాల క్రీడల్లో యువత రాణిస్తున్నారన్నారు. హుకుంపేట మండలం రంగిసింగిపాడుకు చెందిన అంధ గిరిజన క్రీడాకారిణి ప్రపంచ అంధుల క్రికెట్ పోటీల్లో ప్రతిభ చూపడాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు.వాలీబాల్, క్రికెట్, ఖోఖో,కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలకు 508 క్రీడాకారులు ఆన్‌లైన్ చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఏపీ ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా పోటీల్లో గిరిజన యువత రాష్ట్ర స్థాయిలో సత్తా చాటాలన్నారు. మండల పరిషత్ వద్ద వారు పలు క్రీడల్లో పాల్గొని ఉత్సాహపరిచారు. ఎంపీడీవో సాయినవీన్, జిల్లా క్రీడల అధికారి జగన్మోహనరావు, క్రీడల అభివృద్ధి విభాగం కార్యదర్శి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, ఎంపీటీసీలు గిడ్డి విజయలక్ష్మి,లకే రామకృష్ణపాత్రుడు, నరసింహమూర్తి, సన్యాసిరావు, మీనాకుమారి, చిట్టమ్మ, పలాసి రాజేశ్వరి, సుబ్బమ్మ, సర్పంచ్‌లు బసవన్నదొర, సీదరి రాంబాబు,వంతాల రాంబాబు,గబ్బాడి చిట్టిబాబు,సోమెలి లక్ష్మణరావు,పాంగి రాంబాబు,అప్పలకొండ పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా సామాజిక సాధికార బస్సు యాత్ర

- విజయవంతం చేయాలి
- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పిలుపు

అరకులోయ టౌన్: నియోజకవర్గంలోని హుకుంపేట మండలంలో ఈనెల 12న నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పిలుపు నిచ్చారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ ముఖ్య నేతలతో సన్నాహాక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బస్సుయాత్రను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి, మంత్రులు పాల్గొంటున్నట్టు తెలిపారు. సమావేశానికి హాజరయ్యే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా భోజన సదుపాయం కల్పిస్తున్నట్టు చెప్పారు. ఎంపీపీ రంజపల్లి ఉషారాణి, మాజీ జిల్లా అధికార ప్రతినిధి శెట్టి అప్పాలు, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజ రమేష్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్, తదితరులు మాట్లాడారు.



హాజరైన ముఖ్య నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్గుణ

విజయవంతంగా 'గడప గడపకు'

నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్టు అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. నియోజకవర్గంలోని 135 గ్రామ పంచాయతీల్లో ఇప్పటివరకు 122 గ్రామ పంచాయతీల్లో 228 రోజులు గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించినట్టు చెప్పారు. వైఎస్సార్, సీఎం జగన్ మోహన్‌రెడ్డి చేసిన మేలు గిరిజనులు మరువరన్నారు. గిరిజనులంతా తమ పార్టీ వెంటే ఉన్నారన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు లోక్కోయి లక్ష్మణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైస్ ఎంపీపీ రామన్న, ఎంపీటీసీ ఎల్‌బీ భీమరాజు, సర్పంచ్ మాదల బుటికి, పార్టీ మండల కన్వీనర్ సంపత్ కుమార్, జిల్లా సంయుక్త కార్యదర్శులు శెట్టి వెంకటరావు, గోపాలరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హస్తిన కుమార్, మండల మహిళా అధ్యక్షురాలు సుమిత్ర, ఉప సర్పంచ్ బురిడి ఆశలత, యువజన విభాగం జిల్లా కార్యదర్శి ఎల్‌బి. కిరణ్, ముఖీ సాంబయ్య, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు పాల్గొన్నారు.

వణుకుతున్న మన్యం

- చింతపల్లిలో పడిపోయిన ఉష్ణోగ్రతలు
- 11.8 డిగ్రీలు నమోదు

సాక్షి,పాడేరు: జిల్లాలోని చింతపల్లిలో ఉష్ణోగ్రతలు రోజురోజుకు పడిపోతున్నాయి. శుక్రవారం 11.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఈ ఏడాది ఇదే రికార్డుగా చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం పేర్కొంది. పాడేరు మండలంలోని మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 14 డిగ్రీలు, అరకులోయలోని కేంద్ర కాఫీబోర్డులో 15.1డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మన్యంలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో చలిగాలుల తీవ్రత పెరిగింది. సాయంత్రం నాలుగు గంటల నుంచి చలిగాలుల ప్రభావం ఎక్కువగా ఉంటోంది. అత్యంత శీతల ప్రాంతాలుగా గుర్తింపు పొందిన అరకులోయ ఘాట్‌లోని సుంకరమెట్ట, పాడేరు ఘాట్‌లోని పోతురాజుస్వామి గుడి వద్ద కాఫీతోటలు, చింతపల్లి మండలంలోని లంబసింగి, కొత్రుబయలు, జీకే.వీధి మండలంలోని ఆర్‌వీ నగర్ ప్రాంతాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున పర్యాటకులు వణికిపోతున్నారు. అర్ధరాత్రి నుంచి పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఘాట్ రోడ్లలోఉదయం 10 గంటల వరకు మంచు తెరలు వీడలేదు.



పాడేరులో ఉదయం 9 గంటలకు దట్టంగా కురుస్తున్న పొగమంచులో రాకపోకలు

పాడేరు నుంచి భద్రాచలానికి ఆర్టీసీ బస్సు

నేడు ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి

సాక్షి,పాడేరు: జిల్లా కేంద్రం పాడేరు నుంచి తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలానికి ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. పాడేరు డిపో నుంచి నడిచే ఈ సర్వీస్‌ను కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి శనివారం ఉదయం ప్రారంభిస్తారని డీఎం శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 11.30 గంటలకు పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఈ బస్సు బయలుదేరి 12.30గంటలకు అరకులోయకు చేరుకుంటుంది. అక్కడ మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరి పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు మధ్యాహ్నం రెండు గంటలకు చేరుకుంటుంది. పాడేరు నుంచి చింతపల్లి, సీలేరు, డొంకరాయి, చింతూరు, కూనవరం, నెల్లిపాక మీదుగా రాత్రి 11గంటలకు భద్రాచలం చేరుకుంటుంది. మరుసటి రోజు ఉదయం 7.30గంటలకు భద్రాచలం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 3.45కు పాడేరుకు చేరుకుంటుందని ఆర్టీసీ డీఎం శ్రీనివాస్ తెలిపారు. బస్సు సర్వీసు ప్రారంభ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు, నామినేటెడ్ పదవుల్లో ఉన్న పెద్దలు హాజరుకావాలని పాడేరు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది కోరారు.

జిల్లాలో 56 శాతం మేర పింఛన్ల పంపిణీ

71,822 మందికి అందజేత

సాక్షి,పాడేరు: వైఎస్సార్ పింఛన్‌కానుక పంపిణీ జిల్లాలో తొలిరోజు 56 శాతం పూర్తిచేశారు.దట్టమైన పొగమంచు, చలిగాలుల్లో గ్రామ వలంటీర్లు వేకువజాము నుంచే పింఛన్లపంపిణీ చేపట్టడంతో లబ్ధిదారుల్లో ఆనందం నెలకొంది. జిల్లాలో 1,28,81మంది పింఛనుదారులు ఉండగా, తొలిరోజు శుక్రవారం రాత్రి 7.30 గంటల వరకు 71,822 మందికి అందజేసి 56శాతం మేర పంపిణీ పూర్తి చేశారు. కూనవరం మండలంలో అత్యధికంగా 85 శాతం నమోదైంది.మిగిలిన పింఛన్‌దారులకు ఈనెల ఐదవ తేదీ లోగా పింఛన్ సొమ్ము పంపిణీ పూర్తి చేస్తామని డీఆర్‌డీఏ పీడీ మురళీ తెలిపారు.



బందపాలం గ్రామంలో చలిలో పింఛన్ పంపిణీ చేస్తున్న గ్రామ వలంటీర్ మాదెల ప్రసాద్

మోహరించిన బలగాలు

సాక్షి,పాడేరు: పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యంలో పోలీసుశాఖ జిల్లా వ్యాప్తంగా తనిఖీలను విస్తృతం చేసింది.ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదేశాల మేరకు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో ప్రధాన జంక్షన్లు, పలు రోడ్లు, కల్వర్టుల వద్ద బాంబు స్క్వాడ్ తనిఖీలు చేపడుతున్నాయి. పలు వాహనాలను నిలిపివేసి ప్రయాణికుల లగేజీ బ్యాగ్‌లను క్షుణంగా తనిఖీ చేస్తున్నారు.జిల్లా కేంద్రమైన పాడేరులో శుక్రవారం ఎస్‌ఐ లక్ష్మణరావు,ఇతర సిబ్బంది ఐటీడీఏ,ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతాల్లో పోలీసు జాగిలాలతో తనిఖీలు చేపట్టారు.

ముంచంగిపుట్టులో..

ముంచంగిపుట్టు: పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యంలో మండల కేంద్రంలో సీఆర్‌పీఎఫ్ పోలీసులు బలగాలు మోహరించాయి. ముఖ్యంగా మారుమూల బూసిపుట్టు, బుంగాపుట్టు, రంగబయలు ప్రాంతాల నుంచి మండల కేంద్రానికి వచ్చే వాహనాలను తనిఖీ చేశారు. ప్రయాణికుల వివరాలు సేకరించి విడిచి పెట్టారు. ముంచంగిపుట్టు నుంచి జోలాపుట్టు, కుమడ, కుజభంగి మార్గాల్లో కల్వర్టులు,వంతెనలను డాగ్, బాంబ్ స్క్వాడ్‌లతో తనిఖీ చేపట్టారు. మారుమూల ప్రాంతాల్లో జరుగుతున్న రహదారి పనులకు సంబంధించిన పొక్లెయిన్లు, జేసీబీలు, రోలర్లు, లారీలను మండల కేంద్రానికి తరలించారు. సరిహద్దు ప్రాంతామైన ఒనకడిల్లీ, మాచ్‌ఖండ్, జోలాపుట్టు గ్రామాల్లో సైతం బీఎస్‌ఎఫ్ బలగాలు సరిహద్దుల్లో రాకపోకలపై నిఘా పెంచాయి. శుక్రవారం ఎస్‌ఐ రవీంద్ర ఆధ్వర్యంలో ముంచంగిపుట్టులో విస్తృతంగా తనిఖీలు చేసారు. ప్రయాణికుల బ్యాగులు,లగేజీలు పరిశీలించి విడిచిపెట్టారు. గత మూడు రోజులుగా మండల కేంద్రంలో రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద పోలీసులతో గస్తీని ఏర్పాటు చేశారు.



ముంచంగిపుట్టులో తనిఖీలు నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ పోలీసులు

గూడెంకొత్తవీధి: పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. వారోత్సవాల సందర్భంగా మావోయిస్టులు ఎటువంటి విధ్వంసాలకు పాల్పడకుండా ఉండేందుకు అన్ని ప్రధాన కూడళ్లు, కీలకప్రాంతాల్లో తనిఖీలు చేపడుతున్నట్టు సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. కల్వర్టులు, వంతెనల వద్ద డాగ్‌స్క్వాడ్, బాంబు స్క్వాడ్‌లతో తనిఖీలు చేపట్టారు.

వంజంగి అద్భుతం

పర్యాటక ప్రాంతం వంజంగి హిల్స్‌లో ప్రకృతి అందాలు కట్టిపడేస్తున్నాయి. వీటిని తిలకించేందుకు శుక్రవారం భారీగా పర్యాటకులు తరలివచ్చారు. కాలినడకన వంజంగి శిఖరాలకు చేరుకుని ఆస్వాదించారు. - సాక్షి, పాడేరు





క్లుప్తంగా

మారేడుమిల్లి సీఐగా రుద్రరాజు

మారేడుమిల్లి : మారేడుమిల్లి సీఐగా రుద్రరాజు భీమరాజు బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఏలూరు రేంజ్ నుంచి ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మారేడుమిల్లి సీఐగా పనిచేసిన రమేష్ వీఆర్‌కు వెళ్లారు.

జారిపడిన పర్యాటకురాలికి గాయాలు



చాపరాయి జలపాతం వద్ద తీవ్రంగా గాయపడిన పర్యాటకురాలు బేబీ

దుంబ్రిగుడ: మండలంలో చాపరాయి జలపాతం వద్ద మైదాన ప్రాంతానికి చెందిన పర్యాటకురాలు షేక్ బేబీ జారిపడి తీవ్రంగా గాయపడింది. మాచర్ల మండలం పల్నాడు గ్రామానికి చెందిన ఆమె చాపరాయి జలపాతం వద్దకు మెట్లు దిగుతుండగా పట్టుతప్పి పడిపోయింది. కాళ్లు విరిగిపోవడంతో వెంటనే స్థానికులు 108కు సమాచారం అందించారు. వెంటనే ఆ వాహనంలో అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.

కల్యాణం.. కమనీయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అదిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్ర అర్చకులు అందజేశారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

మల్కాపురం: రాష్ట్రంలోని యువతకు ఉపాధి అవకాశాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. జీవీఎంసీ 59వ వార్డులోని జింక్ ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా ఉన్న అండాళమ్మ కళాశాలలో ఏపీ సూక్ష్మ, చిన్న మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, పార్టీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ ప్రభుత్వ సలహాదారుడు మిలీనియం శ్రీధర్‌రెడ్డి పర్యవేక్షణలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ముందుగా ఈ మేళాను వైవీ సుబ్బారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి లక్షలాది మంది యువతకు ఉపాధి కల్పించారన్నారు. వలంటీర్ వ్యవస్థతో మరో రెండు లక్షల మందికి ఉపాధి చూపారన్నారు. రాష్ట్రానికి ఐటీ కంపెనీలతో పాటు పలు పరిశ్రమలను తీసుకొస్తూ మరికొంత మందికి ఉద్యోగాలు ఇచ్చారన్నారు. గత టీడీపీ పాలనలో చంద్రబాబు ఇంటికొక ఉద్యోగమని చెప్పి మోసం చేశారని, నిరుద్యోగ భృతి ఇస్తామని చేతులెత్తేశారని విమర్శించారు. పార్టీలు, మతాలు, కులాలకు అతీతంగా సేవలు అందిస్తున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని, అలాంటి వ్యక్తి మళ్లీ ముఖ్యమంత్రి అయితే మరింత మంది నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఇంత చక్కటి మెగా జాబ్‌మేళా నిర్వహించి యువతకు ఉపాధి కల్పనకు చొరవ చూపిన ఆడారి ఆనంద్‌కుమార్‌ను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. అనంతరం ఇంటర్వ్యూలో ఉద్యోగం సాధించిన పలువురికి ఆయన నియామక పత్రం అందజేశారు. పశ్చిమ సమన్వయకర్త ఆడారి మాట్లాడుతూ తొలి రోజు ఊహించని విధంగా మంచి స్పందన లభించిందన్నారు. ఈ మేళాలో వివిధ కంపెనీల్లో సుమారు 1256 మంది ఉద్యోగాలు పొందారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రినాథ్, పార్టీ పశ్చిమ పరిశీలకుడు ఎస్.ఎ.రెహమాన్, ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్, పలు వార్డుల కార్పొరేటర్లు పి.వి.సురేష్, బల్లా లక్ష్మణరావు, కొణతాల సుధ, గులిగిందల లావణ్య, గుండపు నాగేశ్వరరావు, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



చంటిపిల్లాడుతో ఇంటర్వ్యూకు వచ్చిన వ్యక్తి



వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన నిరుద్యోగ యువతీ, యువకులు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ఓ కంపెనీ ప్రతినిధి

చాలా సంతోషంగా ఉంది



పారిశ్రామిక ప్రాంతంలో జాబ్‌మేళా నిర్వహించడం చాల సంతోషంగా ఉంది. ఫార్మా కంపెనీలో ఇంటర్వ్యూకు వెళ్లాను. ఉద్యోగం తప్పక వస్తుందన్న నమ్మకం కలిగింది.

– జి.అశ్విని(బీఎస్‌ఈ), పూర్ణామార్కెట్

పలు కంపెనీలు ఒకే వేదికపై చూడటం తొలిసారి



ఒకే వేదికపై ఇన్ని కంపెనీలు ఇంటర్వ్యూ నిర్వహించడం బాగుంది. బీటెక్ సీఎస్‌సీ పూర్తి చేశారు. ఉద్యోగం కోసం పలు చోట్లకు తిరగాల్సిన పరిస్థితి ఉంది. కానీ నేడు ఇక్కడే పలు సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయి. ఏదో ఒక కంపెనీలో జాబ్ వస్తుందన్న నమ్మకం ఉంది.

– ఎం.రవళి, బీటెక్, శ్రీహరిపురం

ఉద్యోగం సాధించా..



ఎంబీఏ(హెచ్‌ఆర్) పూర్తి చేశాను. ఒకే చోట ఇన్ని కంపెనీలు నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు ముందుకు రావడం చాలా ఆనందంగా ఉంది. నాకు డిజిటల్ ఉమెన్ సర్వీసులో ఉద్యోగం వచ్చింది. రూ.3.8 లక్షల వార్షిక ప్యాకేజీతో ఎంపికయ్యాను.

– అనీత, ఎంబీఏ, మల్కాపురం

టెక్ మహీంద్రలో జాబ్ వచ్చింది

బీటెక్ పూర్తయింది. ఇక్కడ నిర్వహించిన ఇంటర్వ్యూలో టెక్ మహీంద్ర కంపెనీలో ఉద్యోగం సాధించాను. మంచి ప్యాకేజీ కూడా లభించింది. ట్రైనింగ్ పీరియడ్ రూ.3లక్షల ప్యాకేజీ కాగా.. అనంతరం రూ.8 లక్షల వార్షిక ప్యాకేజీకి ఒప్పందం జరిగింది. చాలా సంతోషంగా ఉంది. ఇలాంటి బృహత్తర కార్యక్రమం నిర్వహించిన ఆడారి ఆనంద్‌కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.

– కె.మణికంఠ, బీటెక్, ఏదురవానిపాలెం

డ్రోన్ పనితీరుపై అవగాహన

రాజవొమ్మంగి: మండలంలోని కొండపల్లి, శరభవరం గ్రామాల్లో ఏవో రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో రైతులకు డ్రోన్‌ల పనితీరు, ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ డ్రోన్‌ల ద్వారా మందులు, విత్తనాలు పిచికారీ పనులు చేయవచ్చన్నారు. పలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు.సర్పంచ్ జగన్నాథం, బీజేపీ నేత సూరిబాబు, ఎంపీడీఓ యాదగిరీశ్వరరావు, వైద్యాధికారి సుష్మా, జీసీసీ మేనేజర్ విజయలక్ష్మి, ఐసీడీఎస్ సీడీపీఓ దైవమణి, ఏపీఎం ఆదినారాయణ, అడిషనల్ ఎస్‌ఐ జాన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పార్టీ శ్రేణుల పల్లెనిద్ర



వంతాడపల్లిలో బుక్‌లెట్‌లను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ మాదెల రమణమ్మ, నాయకులు

సాక్షి,పాడేరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో పల్లెనిద్ర కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పర్యటించి స్థానికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా పథకాల బుక్‌లెట్‌లను పంపిణీ చేస్తున్నారు. గ్రామస్తులతో కలిసి భోజనాలు చేసి రాత్రి బస చేస్తున్నారు. మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.రాంబాబు, నేతలు రమణమూర్తి, పాడేరు మార్కెట్ కమిటీ చైర్మన్ సూరిబాబు, డైరెక్టర్ లరామసత్యవతి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, పార్టీ పంచాయతీరాజ్ విభాగ జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు,జిల్లా కార్యవర్గ సభ్యుడు దశమూర్తి, సర్పంచ్‌లు రమణమ్మ, , బసవన్నదొర, రాంబాబు, సన్నిబాబు, నాయకులు గంగరాజు, కొండబాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వంతాడపల్లిలో చలిమంట వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు

రేంజ్ పరిధిలో 78 మంది పోలీస్ సిబ్బంది బదిలీ

అల్లూరి జిల్లా నుంచి అనకాపల్లి జిల్లాకు..

సాక్షి, అనకాపల్లి: విశాఖ రేంజ్ పరిధిలో 78 మంది పోలీస్ కానిస్టేబుళ్లు బదిలీ అయ్యారు. ఏజెన్సీ ప్రాంతం(అల్లూరి జిల్లా)లోని వివిధ పోలీసు స్టేషన్లు, ప్రత్యేక విభాగాల్లో పనిచేస్తున్న ఇద్దరు ఏఎస్‌ఐలు, 45 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 31 మంది కానిస్టేబుళ్లను అనకాపల్లి జిల్లాకు బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు స్పౌజ్, మెడికల్ కేటగిరీకి ప్రాధాన్యతనిచ్చి, అత్యంత పారదర్శకంగా బదిలీలు నిర్వహించినట్లు అనకాపల్లి జిల్లా ఎస్పీ మురళీకృష్ణ వెల్లడించారు. ఏజెన్సీలో దీర్ఘకాలంగా పనిచేస్తున్నవారికి, అనారోగ్య సమస్యలున్నవారికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కానిస్టేబుల్ నుంచి ఏఎస్‌ఐ స్థాయి వరకు సిబ్బంది వినతులను స్వీకరించి బదిలీ చేశారు. అదనపు ఎస్పీ(పరిపాలన) బి.విజయభాస్కర్, దిశ డీఎస్పీ మళ్ల మహేశ్వరరావు, డీపీవో ఏవో బి.శారద, సిబ్బంది పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్పీ మురళీకృష్ణ

3న పూర్వ విద్యార్థుల సమావేశం

డాబాగార్డెన్స్ : ఈ నెల 3న ఎంవీపీ డబుల్‌రోడ్డులో గల ఐఏఎం కళాశాలలో ఇంజనీరింగ్ కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘం (కాకినాడ) సమావేశం నిర్వహించనున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు ఏఎస్ఎన్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పలువురు అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ఆదివారం నిర్వహించనున్న పూర్వ విద్యార్థుల సమావేశంలో ఐఏఎస్, ఐపీఎస్, ఇంజనీరింగ్ ఎగ్జిక్యూటివ్‌లు, ఇంజనీర్లు పాల్గొంటున్నట్టు తెలిపారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయపడిన లైన్‌మెన్ సహాయకుడు వెంకటరమణ

చింతపల్లి రూరల్: మండలంలో శుక్రవారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మండల కేంద్రంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం స్తంభం ఎక్కిన లైన్‌మెన్ సహాయకుడు సురగాం వెంకటరమణ విద్యుత్ షాక్ గురై తీవ్రంగా గాయపడ్డాడు. అదేవిధంగా గూడెం కొత్తవీధి రంపులకు చెందిన పాంగి సందిప్(9) అనే బాలుడు చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. వీరిద్దరికి స్థానిక ఏరియా ఆస్పత్రిలో వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యానికి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు కన్నూరుపాలెం హైస్కూలు విద్యార్థులు



జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన కన్నూరుపాలెం హైస్కూలు విద్యార్థులు రాజేష్, జ్యోత్స్న

కశింకోట: జాతీయ స్థాయి ఖో–ఖో పోటీలకు కన్నూరుపాలెం హైస్కూలుకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల కాకినాడలో స్కూలు గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన 17 ఏళ్లలోపు విభాగం పోటీల్లో పాల్గొన్న ఈ స్కూలు విద్యార్థులు ఎ.రాజేష్, పి.జ్యోత్స్నలు ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. వీరు మహారాష్ట్రలోని నాసిక్‌లో జాతీయ స్థాయి ఖో–ఖో పోటీలో పాల్గొనున్నట్టు స్కూలు వ్యాయామ ఉపాధ్యాయుడు పీలా వీరునాయుడు తెలిపారు.ఈ విద్యార్థులను జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, సర్పంచ్ ఎస్.శివ, ఎంపీటీసీ సభ్యురాలు కన్నూరు అచ్చియ్యమ్మ, హెచ్‌ఎం ఎస్ఎస్ రామప్రసాద్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

సీఐ రామారావుకు అభినందనలు



సీఐ రామారావుని అభినందిస్తున్న నాయకులు

ఎటపాక: నూతనంగా ఎటపాక సీఐగా బాధ్యతలు చేపట్టిన రామారావుని ఎంపీటీసీ సభ్యుడు వెంకటరామిరెడ్డి తదితరులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బదిలీపై వెళ్లన్న గజేంద్రకుమార్‌ను సన్మానించారు. ఉప సర్పంచ్ శశికుమార్, నాయకులు వెంకట్, నాగేశ్వరరావు, కన్నయ్య, శివ, రాము తదితరులున్నారు.

వెటర్నరీ విభాగంలో విప్లవాత్మక మార్పు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సర్పంచ్ పుష్పలత, ఏడీ చంద్రశేఖరరావు

చింతపల్లిరూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పశుసంవర్ధకశాఖలో విప్లవత్మాక మార్పు చోటుచేసుకున్నట్టు సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు. వెటర్నరీ విద్య పూర్తి చేసుకున్న 18 మందికి ఆమె శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. పాడి రైతులకు సేవలందించాలని సూచించారు. ఏడీ చంద్రశేఖరరావు, చింతపల్లి, జీకెవీధి, కొయ్యూరు వైద్యులు షాలీనీ, దమయంతి, ప్రసన్నకుమార్, కో–అప్షన్ సభ్యుడు నాజర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాలు

మహారాణిపేట : జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర శుక్రవారం కారుణ్య నియామకాల ద్వారా అర్హులైన అభ్యర్థులకు పోస్టింగులిచ్చారు. కొంత మందికి పదోన్నతులు కల్పించారు. అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని త్వరితగతిని ఉద్యోగాలు ఇవ్వడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఈవో ఎం.పోలినాయుడు, డిప్యూటీ సీఈవో డి.సత్యనారాయణ, ఉద్యోగ సంఘాల అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

ఆర్‌జేడీ జ్యోతికుమారి



ఉపాధ్యాయుల సమావేశంలో ఆర్‌జేడీ జ్యోతికుమారి

కె.కోటపాడు: టెన్త్ ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని, అందుకు అనుగుణంగా బోధన చేయాలని విద్యాశాఖ ఆర్‌జేడీ ఎం.జ్యోతికుమారి అన్నారు. స్థానిక హైస్కూల్‌ను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సబ్జెక్ట్‌లలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి మరింతగా అర్థమయ్యేలా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రస్తుతం పాఠశాలల్లో జరుగుతున్న పరీక్షల్లో మంచి మార్కులను సాధించిన టెన్త్ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందించాలన్నారు. జనవరి చివరి నాటి టెన్త్ సిలబస్‌ను పూర్తి చేయాలని తెలిపారు. రక్తహీనత సమస్య గల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తరువాత ఐరన్ మాత్రలను తప్పనిసరిగా అందించాలని తెలిపారు. టోఫిల్ పరీక్షలను విద్యార్థులకు నిర్వహిస్తున్నారో లేదా అని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఎంఈవోలు సత్యనారాయణ, డి.వి.డి. ప్రసాద్, ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి పాల్గొన్నారు.

88 కిలోల గంజాయి పట్టివేత

ముగ్గురి నిందితుల పరారీ



గంజాయి, పట్టుబడిన ఆటో, బైకుతో పోలీసులు

రోలుగుంట: నర్సీపట్నం–వడ్డాది ఆర్‌అండ్‌బీ రోడ్డులో 88 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం ఉదయం ఇక్కడ నిండుగొండ కూడలి వద్ద ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో చింతపల్లి నుంచి ఆటోలో తరలిస్తున్న మూడు గోనె సంచుల్లో గంజాయిని గుర్తించారు. గంజాయితోపాటు మోటారు బైకు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఆటో డ్రైవర్ బాలుడిపై కేసు నమోదు చేసి కొత్తకోట సీఐ ఇలియాస్ మహమ్మద్ ఆదేశాలతో జువైనల్ హోమ్‌కు తరలించిచారు. పరారైన ముగ్గురి నిందితుల కోసం కోసం గాలిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

గణిత శాస్త్ర విభాగాధిపతిగా అనురాధ కామేశ్వరి



ఉత్వర్వులు స్వీకరిస్తున్న అనురాధ కామేశ్వరి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం గణిత శాస్త్ర విభాగాధిపతిగా ఆచార్య పి.అనురాధకామేశ్వరి నియమితులయ్యారు. ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత నుంచి ఆమె నియామక ఉత్తర్వులు స్వీకరించారు. అనంతరం విభాగంలో బాధ్యతలు చేపట్టారు. మూడేళ్ల పాటు ఆమె ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ సందర్భంగా ఆచార్య అనురాధ కామేశ్వరిని గణితశాస్త్ర విభాగ ఆచార్యులు అభినందించారు.

ఇన్‌చార్జి వీసీ సమతకు అభినందన



ఆచార్య కె.సమతను అభినందిస్తున్న మానవత సభ్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమతను మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు శుక్రవారం తన కార్యాలయంలో అభినందించారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఓఎస్‌డీ, మానవత సంస్థ వర్సిటీ చైర్మన్ ఆచార్య వి.కృష్ణమోహన్, సంస్థ వ్యవస్థాపకుడు ఎన్.రామచంద్రారెడ్డి, అధ్యక్షుడు ఆచార్య ఎన్.ఎ.డి.పాల్, ఆచార్య కె.సీతామాణిక్యం, డాక్టర్ రాజమాణిక్యం, సంస్థ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ఏయూ గాంధీ అధ్యయన కేంద్రాన్ని సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి సందర్శించారు.

మహిళా డిగ్రీ కళాశాలలో పీజీ స్పాట్ అడ్మిషన్లు

డాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి పీజీ స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీ ఆసెట్ రాసి, సీట్ రాని విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు చెప్పారు.

12 పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9052297729, 9396235303 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.